సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



కుంటుబడ్డ ఇంటి ప్రణాళికలు

పట్టణాల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 20ని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ప్లాన్ అప్రూవల్స్ నిలిచి, ఆదాయం తగ్గుతోంది.


10లో



పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల కబ్జాలను నిరోధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.

5,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 5,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

47 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం



ర్యాలీలో పాల్గొన్న డీపీఎం తాతారావు, రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రత్యేక అధికారి ముస్తఫా

నల్లజర్ల: జిల్లావ్యాప్తంగా వచ్చే ఖరీఫ్‌లో 47 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) తాతారావు వెల్లడించారు. ప్రకృతి సాగుపై నల్లజర్లలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన, రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రత్యేకాధికారి ముస్తఫా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ, సీజన్‌కు 45 రోజుల ముందు ఈ 47 వేల ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మరో 8 వేల ఎకరాల్లో ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా, సహజ పద్ధతుల్లో వరి సాగు చేపట్టనున్నామని చెప్పారు. మూడు నాలుగు సెంట్ల విస్తీర్ణం చొప్పున 20 వేల యూనిట్లలో కిచెన్ గార్డెన్లు వేయిస్తున్నామన్నారు. పంటపై డ్రోన్ల ద్వారా కషాయాలు, జీవామృతం పిచికారీ చేయనున్నామన్నారు. వంద గ్రామాల్లో వెయ్యి మంది రైతులతో దేశవాళీ వరి సాగు చేపట్టనున్నామని తెలిపారు. ప్రస్తుతం కొన్ని గ్రామాలకే పరిమితమైన ప్రకృతి సాగును అన్ని రైతు సేవా కేంద్రాలకూ విస్తరింపజేయాలన్నదే లక్ష్యమని తాతారావు చెప్పారు. సేంద్రియ కర్బనం, సహజమైన సూక్ష్మక్రిములు చనిపోకుండా మొక్కల ఎదుగుదలకు తోడ్పడేందుకు 32 రకాల విత్తనాలు (నవధాన్యాలు) రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తున్నామని తెలిపారు. వీటిలో ఆకుకూరలు, కూరగాయలు, పశువుల మేత ఉంటాయని, వీటిని తొలకరికి ముందే దమ్ములో కలియదున్నడం వలన భూసారం పెరగడంతో పాటు అదనపు ఆదాయం కూడా వస్తుందని వివరించారు. భూమిని 365 రోజులూ పచ్చగా ఉంచడం ద్వారా గాలిలోని కార్బన్ డయాక్సైడ్ భూమిలో సేంద్రియ కర్బనంగా స్థిరీకరణ అవుతుందని తాతారావు చెప్పారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం మహబూబ్ వలీ, యూనిట్ ఇన్‌చార్జి కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నాలుగో విడత స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించి, ఉపయోగంలోనికి తీసుకుని రావడంపై దృష్టి సారించాలని అన్నారు. ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపల్ వార్డుల్లో ఈ అంశంపై గ్రామసభ నిర్వహించాలని సూచించారు. కార్యాలయాలను పూర్తి స్థాయిలో శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ కూడా పాల్గొన్నారు.

శిశిరంలో వసంతంలా..

- మోడువారిన భారీ వృక్షాలకు పునరుజ్జీవం
- కడియం నర్సరీ రైతుల ఘనత

కడియం: శిశిర రుతువులో ఆకులన్నీ రాలిపోయి చెట్లు మోడుల్లా మారుతూంటాయి. అలా మోడువారిన చెట్లన్నీ.. తిరిగి వసంత రుతువు ఆగమనాన్ని సూచిస్తూ లేచివుళ్లు వేసి.. చూస్తూండగానే తిరిగి ఆకుపచ్చని శోభను సంతరించుకుంటాయి. ఇదంతా సహజంగా జరిగే ప్రక్రియ. కానీ, అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, ఇతర కారణాలతో నరికివేసే భారీ వృక్షాలు మాత్రం మోడుల్లానే మిగిలిపోతూ.. చివరకు జీవాన్ని కోల్పోతున్నాయి. దీనిపై ఇలా చెట్ల నరికివేతపై పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇటువంటి వృక్షాలకు మళ్లీ జీవం పోస్తూ.. వాటికి వసంత శోభను తీసుకుని వస్తున్నారు కడియం ప్రాంత నర్సరీ రైతులు. వినూత్న రకాల మొక్కలను వేలాదిగా ఇక్కడి నర్సరీల్లో అందుబాటులో ఉంచుతూ, దేశవిదేశాల్లో కడియం ప్రాంతానికి ఎంతో గుర్తింపును తీసుకుని



ట్రాలీపై రవాణా చేస్తున్న భారీ వృక్షం



కడియం ప్రాంత నర్సరీ రైతులు పునరుజ్జీవం కల్పిస్తున్న భారీ వృక్షాలు

వచ్చిన ఈ ప్రాంత రైతులు.. భారీ వృక్షాలకు పునరుజ్జీవం పోస్తూ, కొత్త చరిత్ర సృష్టిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో మోళ్లుగా మిగిలిన రావి, మర్రి, జమ్మి, జువ్వి, బాదం, ఉసిరి, గానుగ, కదంబం, కొబ్బరి, తాటి వంటి భారీ వృక్షాలను వేర్లతో సహా పెకలించి, ఇక్కడకు తీసుకుని వస్తున్నారు. వాటిని బతికించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. దీనికోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒకవేళ తీసుకువచ్చిన వృక్షం చనిపోతే, ఆ మేరకు నష్టాన్ని కూడా వీరు భరించాల్సి ఉంటుంది. అయినప్పటికీ వారు ఏమాత్రం వెనుకాడటం లేదు. చెట్టు ఎంత భారీ సైజులో ఉన్నప్పటికీ, నిపుణుల పర్యవేక్షణలో తొలగించి, వేర్లకు ప్రత్యేక పోషణ చేపడుతున్నారు. వేర్లు దెబ్బ తినకుండా తగు జాగ్రత్తలు తీసుకుని, ట్రాలీలపై తీసుకుని వస్తున్నారు. అలా తెచ్చిన చెట్లకు మినరల్స్, సూక్ష్మ పోషకాలు (మైక్రో న్యూట్రియెంట్స్) అందించి, మాను నుంచి చిగుళ్లు వచ్చే వరకూ పోషిస్తారు. చిగుళ్లు వచ్చి, చెట్టు మళ్లీ బతికిందని నిర్ధారించుకున్న తరువాత రవాణాకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియకు ఏడాది నుంచి నాలుగైదేళ్ల వరకూ పడుతుంది. అప్పటి వరకూ దీనిపై పెట్టుబడి పెడుతూనే ఉండాలి. చెట్టు సైజు, వయస్సును బట్టి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ వీటిని విక్రయిస్తున్నారు.

ఆలయాల నుంచి డిమాండ్

లక్షలాది రూపాయలు వెచ్చించి, పునరుజ్జీవింపజేసిన భారీ వృక్షాలకు ఆలయాల నుంచి డిమాండ్ ఉంటోంది. ఆలయం ఎంత భారీగా నిర్మించినప్పటికీ, అందుకు తగిన విధంగా సంబంధిత వృక్షాన్ని నాటడానికి దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు. కడియం ప్రాంతం నుంచి భారీ వృక్షాలను తీసుకుని వెళ్లి, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాల్లో నాటుతున్నారు. అలాగే, జన్మ నక్షత్రాన్ని అనుసరించి, తగిన వృక్షాన్ని కూడా పెంచుకునేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో కూడా భారీ వృక్షాలకు డిమాండ్ ఏర్పడుతోంది. చెట్టు సైజు, వయస్సును బట్టి ధర పలుకుతుంది.

– కొత్తపల్లి మూర్తి, బుర్రిలంక, కడియం మండలం

- తమ్ముళ్లు X గ్లాస్‌మేట్స్

కూటమిలో కుంపటి



నిడదవోలు సమావేశంలో ఆవేదన వెళ్లగక్కుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు



అభివృద్ధి పనులకు తమను ఆహ్వానించలేదంటూ టీడీపీ నేతల నిరసన (ఫైల్)

- నిడదవోలులో ఇరు పార్టీల మధ్య అసమ్మతి సెగలు
- జనసేన నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదని టీడీపీ శ్రేణుల ఆగ్రహం
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం లేదని అసంతృప్తి
- అన్నీ జనసేన వారికే దక్కడంపై మండిపాటు
- నిరసనగా టీడీపీ పట్టణాధ్యక్ష పదవికి కొమ్మిన రాజీనామా
- అదే బాటలో మరికొంత మంది నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం: నిడదవోలులో కూటమి నేతల మధ్య వర్గవిభేదాలు చల్లారడం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సీట్ల సర్దుబాటు, జనసేనకు ఎమ్మెల్యే స్థానం కేటాయించినప్పుడు మొదలైన వైషమ్యాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యేగా జనసేన నేత కందుల దుర్గేష్ నెగ్గి, మంత్రి పదవి పొందినా అసమ్మతి జ్వాలలు మాత్రం ఆరడం లేదు. జనసేన నేతల నిర్ణయాలు, వ్యవహార శైలి టీడీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. వెరసి కూటమిలో వర్గ విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. టీడీపీ నేతలు బహిరంగ విమర్శలు గుప్పించి మరీ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేంత స్థాయిలో విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటి వరకూ నోరు విప్పని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సైతం తమకు ప్రాధాన్యం దక్కడం లేదంటూ జనసేన తీరుపై అసహనం వ్యక్తం చేయడంతో విభేదాల కుంపటి మరింత రాజుకుంది. జనసేన నేతలు మిత్రధర్మాన్ని తుంగలో తొక్కి అంతా తామై వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కూటమి బీటలు వారే పరిస్థితి తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాజీనామాల బాట

నిడదవోలు నియోజకవర్గంలో బుధవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక, టీడీపీ విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా జనసేన నేతల నుంచి ఎదురవుతున్న అవమానాలపై తెలుగు తమ్ముళ్లు గళం విప్పారు. ఇలాగైతే తాము పార్టీలో కొనసాగలేమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఎదుటే వారు కుండ బద్దలుగొట్టారు. మంత్రి పర్యటనలకు సంబంధించి కనీస సమాచారం కూడా తమకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై, పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు చేసిన తనను జనసేన నేతలు ఏమాత్రం గుర్తించడం లేదని కొమ్మిన వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు సమావేశంలో ప్రకటించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే తాము కూడా రాజీనామా బాట పట్టేందుకు సిద్ధమని మరికొంత మంది తెలుగు తమ్ముళ్లు ప్రకటించారు. ఈ సందర్భంగా 'ప్రొటోకాల్ ప్రకారం నాకు, టీడీపీ శ్రేణులకు జనసేన నేతలు సమాచారం ఇవ్వడం లేదు. అధికారిక కార్యక్రమాలకు సైతం నన్ను దూరం పెడుతున్నారు. టీడీపీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నాం' అంటూ మాజీ ఎమ్మెల్యే శేషారావు చేసిన హాట్ కామెంట్స్ సభలో దుమారం రేపాయి. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత అయిన ఆయనకే ఇలా జరిగితే తమ పరిస్థితి ఏమిటనే మీమాంస కార్యకర్తల్లో నెలకొంది.

ఆది నుంచీ అంతే..

టీడీపీ, జనసేనల మధ్య ఆది నుంచీ విభేదాల కాక రగులుతూనే ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను ప్రకటించారు. అప్పట్లో దీనిని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సీటు తమ నేతకే కేటాయించాలంటూ శేషారావు స్వగ్రామం వేలివెన్ను చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకూ ఈ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక నిడదవోలు 27వ వార్డు పాటి మీద సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ నేతలకు ఆహ్వానం లభించలేదు. ఈ పరిణామం ఇరు పార్టీల మధ్య విభేదాలకు మరింత ఆజ్యం పోసింది. వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేర్చుకుంటున్న సమయంలో తమకు కనీస సమాచారం ఇవ్వలేదంటూ టీడీపీ శ్రేణులు అగ్గి మీద గుగ్గిలవుతున్నాయి.

కవరింగ్‌కు దుర్గేష్ ప్రయత్నం

జనసేనపై టీడీపీ నేతలు ఒక్కసారిగా విమర్శల అస్త్రం ఎక్కుపెట్టడం నిడదవోలు నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో మంత్రి దుర్గేష్ గురువారం నిడదవోలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, కవరింగ్ ప్రయత్నాలకు దిగారు. జనసేన నేతలు మొదటి నుంచీ సంయమనంతోనే ఉన్నారని అన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీ నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. స్థానిక టీడీపీ నేతలు చెప్పిన ప్రతి అంశాన్నీ పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. అయితే, దీనిపై టీడీపీ నేతలు మాత్రం సంతృప్తి చెందడం లేదు.

అన్ని పనులూ జనసేనకేనా..?

- కూటమిలో మిత్రధర్మం ప్రకారం అభివృద్ధి పనులను జనసేన, టీడీపీ నేతలకు సమానంగా కేటాయించాల్సి ఉంది. కానీ, జనసేన నేతలకు మాత్రమే కట్టబెట్టడాన్ని టీడీపీ నేతలు విభేదిస్తున్నారు.
- స్వయం ఉపాధి రుణాల్లో సింహభాగం తమకే కావాలని జనసేన నేతలు కోరుతూండటంతో టీడీపీ నేతలు రగిలిపోతున్నారు. టీడీపీకి కేవలం 30 శాతం రుణాలు మాత్రమే ఇస్తామని, తమ పార్టీకి చెందిన మంత్రి నియోజకవర్గంలో తమకే ప్రాధాన్యత దక్కాలని జనసేన నేతలు చెబుతూండటం వివాదాస్పదంగా మారుతోంది.
- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా నిలిచిన వారిని సైతం జనసేనలో చేర్చుకుంటున్నారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.
- ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయించారు. ఆ పనులన్నీ మంత్రి అనుచరుడు, జనసేన నేతలే దగ్గరుండి చేపట్టారు. తమకు నయా పైసా కూడా ఇవ్వకపోవడం టీడీపీ నేతలకు మింగుడు పడని అంశంగా మారింది.
- కోటసత్తెమ్మ ఆలయ కమిటీ పాలకవర్గం, నిడదవోలు ఏఎంసీ పాలకవర్గ ఎంపికలో తమకు ప్రాధాన్యం దక్కాలని టీడీపీ, జనసేన నేతలు పోటీ పడుతున్నారు. ఈ విషయం తలనొప్పిగా మారడంతో పదవుల ఎంపిక పెండింగ్‌లో పెట్టారు.
- జనసేనకు మంత్రి పదవి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే శేషారావుకు ఎలాంటి పదవీ దక్కకపోవడంపై టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వారు తమ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.
- పల్లెపండుగలో భాగంగా నిడదవోలు మండలం కంసాలపాలెంలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మాజీ ఎమ్మెల్యే శేషారావుకు, తమకు ఆహ్వానం అందలేదంటూ మంత్రి దుర్గేష్‌ను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ వివాదం అప్పట్లో సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది.

పాపాలు చేస్తే శాపాలు తప్పవు

- రావణ వృత్తాంతం చెప్పేదిదే..
- ప్రవచన విరించి సామవేదం షణ్ముఖశర్మ



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'ఇతరులను హేళన చేస్తే పరాభవం తప్పదు. అధర్మవర్తనంతో తపోబలం క్షీణిస్తుంది. పాపాలు చేస్తే శాపాలు తప్పవు' అని ప్రవచన విరించి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగం ఆధ్వర్యాన స్థానిక టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఉత్తరకాండపై మూడో రోజు ప్రవచనాన్ని ఆయన కొనసాగించారు. 'నీది వానరముఖం అని నందీశ్వరుడిని హేళన చేసిన రావణునికి వానరుల చేతిలో పరాభవం తప్పదన్న శాపం ఎదురైంది. వేదవతిని పరాభవించినప్పుడు ఆమె మరుసటి జన్మలో అయోనిజగా జన్మించి, సపరివారంగా రావణుడు నశించడానికి కారకురాలినవుతానని శపించింది. ఇక్ష్వాకువంశానికి చెందిన రాజు అనరణ్యుడు.. రావణుని చేతిలో పరాజితుడై, మా వంశంలో జన్మించే శ్రీరాముని చేతిలో నీవు మరణిస్తావని శపించాడు. రావణుని చేతిలో బందీలుగా చిక్కిన ఎందరో దేవకాంతలు, ఋషి కన్యలు, మానవకాంతల కన్నీరే రావణుని పాలిట పెనుశాపంగా మారింది' అని సామవేదం అన్నారు. ధర్మాచరణతో అల్పాయుష్కుడు కూడా దీర్ఘాయువు పొందగలడని, దీనికి విలోమంగా దీర్ఘాయువు వరంగా గలవాడు కూడా పాపకృత్యాలతో అల్పాయుష్కుడు కాగలడని చెప్పారు. 'కైలాసగిరిని పెకలించబోయి భంగపాటుకు గురైన రావణుడు పెద్దగా రోదించినప్పుడు, దయాళువు అయిన పరమ శివుడు అతనికి విడుదల ప్రసాదించి, ఇక నుంచి నీవు రావణుడిగా పేరు పొందుతావని అన్నాడు. అప్పటి నుంచీ రావణ శబ్దం వ్యాప్తిలోకి వచ్చింది. రామ అనే శబ్దానికి అందరికీ ఆనందాన్ని కలిగించేదని అర్థమైతే, రావణ శబ్దానికి అందరినీ ఏడిపించడం అనే అర్థం ఉంది' అని వివరించారు. వేదవతి తామర పూవులో శిశువుగా ఉద్భవించడం, రావణుడు ఆ శిశువును సముద్రంలో పడవేయడం ప్రాచీన రామాయణ ప్రతుల్లో లేదని, ఇది ప్రక్షిప్తమని చెప్పారు. కృతయుగాంతంలో వేదవతిని పరాభవించిన రావణుడు త్రేతాయుగంలో శ్రీరాముని చేతిలో మరణించాడంటే.. ఆయన ఎప్పటివాడో మనం ఊహించుకోవచ్చునని సామవేదం అన్నారు. తొలుత భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు స్వాగత వచనాలు పలికారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి టీవీ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా సుమారు రూ.20 వేల పారితోషికంతో, ప్రారంభంలో 11 నెలలకు, తరువాత పొడిగించే పద్ధతిన పని చేయాలన్నారు. నిర్వహణ సమాచార వ్యవస్థ (ఎంఐఎస్), ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం), ద్రవ వ్యర్థాల నిర్వహణ (ఎల్‌డబ్ల్యూఎం) కన్సల్టెంట్ పోస్టులు ఒకొక్కటి, అకౌంటెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక పోస్ట్ ఉన్నాయని వివరించారు. డిగ్రీ చదివి, 2 నుంచి ఐదేళ్ల అనుభవం కలిగిన జిల్లాలోని అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు లాలాచెరువులోని తమ కార్యాలయంలో నేరుగా లేదా 94921 22355 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వారం వారం చంద్రబాబు అప్పులు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చేసిన దుష్ప్రచారానికి సమాధానం చెప్పాలి
- టీటీడీ గోశాలలో గోవుల మృతిపై విజిలెన్స్ విచారణ జరపాలి
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సంపద సృష్టించి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్న సీఎం చంద్రబాబు పది నెలల కాలంలో రూ.90 వేల కోట్లు అప్పులు చేశారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందంటూ అనేక రకాలుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేసిన చంద్రబాబు.. ఇప్పుడు చేస్తున్న అప్పులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపద సృష్టిస్తాం, పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వారం వారం అప్పులు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మడమంటే పులి నోట్లో తలపెట్టినట్లేనంటూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆనాడే చెప్పారని, ఇప్పుడు అదే జరుగుతోందని అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ అవాస్తవాలు ప్రచారం చేసి, రుజువు చేయలేకపోయారన్నారు. ఇప్పుడు టీటీడీ గోశాలలో పెద్ద సంఖ్యలో గోవులు చనిపోయాయని, దీనికి ఏం జవాబు చెబుతారని ప్రశ్నించారు. ఇంత ఘోరం జరిగితే సనాతన పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని నిలదీశారు. టీటీడీ ఈఓ గతంలో 170 గోవులు చనిపోయాయంటున్నారని, మూడు నెలల్లో 40 మాత్రమే చనిపోయాయని చెప్పడం దారుణమని అన్నారు. గోవుల మృతిపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గోవుల మృతికి టీటీడీ చైర్మన్, పాలక మండలి సభ్యులు, ఈఓ బాధ్యత వహించాలని అన్నారు.

కందుకూరికి అగౌరవం

గతంలో కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కందుకూరి వీరేశలింగం విగ్రహం తొలగించి, ఎన్టీఆర్ విగ్రహం పెట్టడం కందుకూరిని అగౌరవపరచడమేనని అన్నారు. అలాగే, జేఎన్ రోడ్డులో ఏకేసీ కళాశాలకు ఆనుకుని ఉన్న హ్యాపీ స్ట్రీట్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు పేరిట ఉన్న పార్కులో ఎన్టీఆర్ విగ్రహం పెట్టారని, ఇది దారుణమని అన్నారు. కావాలనుకుంటే కొత్తగా మరో పార్కు నిర్మించి, ఎన్టీఆర్ పేరు పెట్టుకోవాలని హితవు పలికారు.

సూపర్ బజార్ ముడుపుల ఆరోపణల నిగ్గు తేల్చాలి

గౌతమి సూపర్ బజార్ వ్యవహారంలో తనకు రూ.5 కోట్లు ఇచ్చారంటూ ఈవీఎం ఎమ్మెల్యే ఆరోపించారని, వీటిని నిరూపించాలని సవాల్ చేశారు. ఇప్పుడు అక్కడ భవన నిర్మాణం జరుగుతోందని, పనులు తక్షణం ఆపకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్ల నుంచి ఎమ్మెల్యే ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. లాలాచెరువు వద్ద జాతీయ రహదారి సమీపాన హోండా షో రూం ఎదురుగా ఉన్న 1,300 గజాల భూమి మిగులు అని, పార్క్ స్థలమని పేర్కొంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పందిరి మహాదేవుడు సత్రం భూముల మాదిరిగానే లాలాచెరువు భూమిని కూడా కాపాడేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రుల పరిశీలనకు ఒక కమిటీ వేయాలని భరత్‌రామ్ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బాణసంచా తయారీలో భద్రతా ప్రమాణాలు ముఖ్యం

- కలెక్టర్ ప్రశాంతి
- ఐ.పంగిడిలో బాణసంచా గోదాము దగ్ధం
- రూ.3లక్షల మేర ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన బాణసంచా గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా ఫైర్ క్రాకర్స్ తయారు చేసే యూనిట్స్‌ను పరిశీలించి అక్కడ తగిన భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఐ.పంగిడి గ్రామ శివారున ఫైర్ క్రాకర్స్ గోడౌన్ దగ్ధమైన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి హానీ జరగలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌ల కాల పరిమితి ముగిసిన ఫైర్ క్రాకర్స్ విక్రయ, తయారీదారులను గుర్తించి తక్షణం అనుమతులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాణసంచా భద్రపరుస్తున్న గోదాముల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తున్నారో లేదో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఐ.పంగిడిలో ఫైర్ క్రాకర్స్‌కు ఇచ్చిన అనుమతి మార్చి నెలాఖరు నాటికి ముగిసిందన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: అన్నవరం–హంసవరం మధ్యలో రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం వీరభద్రపేట గ్రామానికి చెందిన నారపురెడ్డి చిన అప్పారావు (55) కటక్ వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిన అప్పారావు ఈ నెల 2న గ్రామస్తులతో కలిసి గుంటూరు జిల్లా కారంపూడికి వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రైలులో ప్రయాణిస్తూ హంసవరం సమీపంలో జారిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కుంటుబడ్డ ఇంటి ప్రణాళికలు

- పట్టణాల్లో పట్టించుకోని ఎల్‌టీపీలు
- జీవో నంబర్ 20ని వ్యతిరేకిస్తూ నిరసన
- ఎల్‌టీపీలను బాధ్యులను చేస్తున్న ఎస్‌సీఎస్ విధానం
- నిలిచిన ప్లాన్ అప్రూవల్స్... తగ్గిన ఆదాయం



అమలాపురం మున్సిపల్ కార్యాలయం

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై తాజాగా జారీ చేసిన జీవో నంబర్ 20ని ఆయా పట్టణాల్లోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు (ఎల్‌టీపీ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ జీవో ద్వారా బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ స్వీయ సర్టిఫికేషన్ స్కీమ్ (ఎస్‌సీఎస్) విధానంతో ఆ బాధ్యతలను ఎల్‌టీపీలకు అప్పగించింది. అయితే ప్లాన్ ఇచ్చిన తర్వాత ఆ భవన యాజమాని ప్లాన్ అతిక్రమిస్తే ఎల్‌టీపీలను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్న నిబంధనను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఎల్‌టీపీలు జీవో వచ్చిన గత రెండు నెలల నుంచి 300 చదరపు మీటర్ల స్థలంలోపులో ఒక్క ప్లాన్ కూడా ఇవ్వకుండా నిరసన తెలుపుతున్నారు. ఫలితంగా జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో ఏడున్నర సెంట్ల లోపు ముఖ్యంగా రెసిడెన్షియల్ బిల్డింగ్‌లకు ప్లాన్‌ల అప్రూవల్‌లు చేయకపోవడంతో ప్లానులన్నీ నిలిచిపోయాయి.

మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చే విధానంలో లోపాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఆ బాధ్యతను ఎల్‌టీపీలకు అప్పగిస్తూ జీవో జారీ చేసింది. ఏదైనా బిల్డింగ్ ప్లాన్‌కు అనుమతి ఇస్తే 10 శాతం వరకూ అతిక్రమణ (డీవియేషన్)కు మినహాయింపు ఉంటుంది. అంతకుమించి అతిక్రమణ జరిగితే భవన నిర్మాణాన్ని నిలిపివేస్తారు. అయితే ప్లాన్ ఇచ్చిన ఎల్‌టీపీని బాధ్యుణ్ణి చేయడం, సంబంధిత ఎల్‌టీపీ లైసెన్స్‌ను అయిదేళ్ల పాటు రద్దు చేయడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా ఉంటాయన్న జీవో నిబంధననే వారు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

మున్సిపాల్టీల ఆదాయాలకు గండి

ఎల్‌టీపీలు బిల్డింగ్ ప్లానులు ఇవ్వకపోవడంతో నిలిచిన భవన నిర్మాణాలతో ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఉదాహరణకు అమలాపురం మున్సిపాలిటీలో గత ఏడాది 300 చదరపు మీటర్ల లోపు భవనాలకు 170 వరకూ ప్లాన్‌లు ఇస్తే జీవో వచ్చిన నాటి నుంచి ఒక్క ప్లాన్ కూడా ఇవ్వలేదంటే పరిస్థితి ఎంత జటిలంగా ఉందో అంచనా వేయవచ్చు. రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి. జిల్లా మొత్తం మీద మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో ఈ జీవో అభ్యంతరాలు లేకపోతే ఈ రెండు నెలల్లో 100కి పైగా ప్లాన్లు మంజూరు చేసే అవకాశం ఉండేది. ప్లాన్‌లు ఇవ్వకపోవడంతో దాదాపు రూ.1.20 కోట్ల వరకూ ఆదాయానికి గండి పడింది. ప్లాన్‌లను ఎల్‌టీపీలు అనుమతించని పరిస్థితుల్లో కొత్తగా 300 చదరపు మీటర్ల లోపు స్థలంలో ఇళ్లు నిర్మించుకునే వారు సైతం ఈ కొత్త జీవో, నిబంధనలపై పెదవి విరుస్తున్నారు. జీవోను వ్యతిరేకిస్తూ ప్లాన్‌లు ఇవ్వని ఎల్‌టీపీల నిరసన ఓ పక్క సాగుతుంటే కొందరైతే ప్లాన్ అప్రూవల్ లేకుండానే సొంత ప్లాన్‌లతో ఇళ్లు నిర్మాణం చేపడుతున్నారు. మున్సిపాలిటీ పరంగా ఏదైనా అభ్యంతరం ఎదురైతే అప్పుడే చూద్దామన్న ధోరణిలో ముందుకు సాగుతున్నారు.

మాపై చర్యలను మినహాయిస్తే జీవోను స్వాగతిస్తాం

భవన యాజమానులు ప్లాన్‌ను అతిక్రమిస్తే తమను బాధ్యులను చేయని పక్షంలో జీవోను స్వాగతిస్తామని ఎల్‌టీపీలు అంటున్నారు. లేదా 300 చదరపు మీటర్లు దాటిన స్థలాలకు ప్లాన్‌ను అనుమతి ఇచ్చే బాధ్యతలు తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో జీవో నంబర్20ని సవరించి ప్లాన్ అతిక్రమణ అయితే తమ లైసెన్స్ రద్దు చేయడం, క్రిమినల్ కేసు వంటి ఆంక్షలు తొలగించాలని సూచిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో అతిక్రమణ జరిగితే భవన యాజమానిని బాధ్యులను చేయాలే తప్ప తమను బాధ్యులను చేయడమేమిటని ఎల్‌టీపీలు ప్రశ్నిస్తున్నారు.

ఒక్క ప్లాన్ కూడా అమలు కాలేదు

జీవో నంబర్ 20 వచ్చినప్పటి నుంచి అమలాపురం మున్సిపాలిటీలో 300 మీటర్ల లోపు ఇంటి స్థలాల్లో ప్లాన్ అప్రూవల్ అవ్వలేదు. 300 మీటర్లు దాటిన స్థలాల్లో పెద్ద భవనాలు, కమర్షియల్ భవనాలకు అనుమతులు ఇచ్చాం.

– రాణి సంయుక్త, టౌన్ ప్లానింగ్ అధికారి, అమలాపురం

జీవో నంబర్ 20ని సవరించాలి

మా ఎల్‌టీపీల ఉనికిని ఇబ్బంది పెట్టేలా ఉన్న జీవో నంబర్ 20ని ప్రభుత్వం సవరించాలి. జీవోలో ఆంక్షలు విధించడం మేం వ్యతిరేకిస్తున్నాం. జీవోను సవరించే వరకూ బిల్డింగ్‌లకు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేది లేదు.

– యేడిద దొరబాబు, అధ్యక్షుడు, ఎల్‌టీపీల అసోసియేషన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- ప్రభుత్వ భూమి కబ్జాలను నిరోధించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- నగరంలో భూ పరిరక్షణ పోరాటం



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని ఆవ పరిసర ప్రాంతాల్లో ఉన్న 28 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ భూమిని లీజు పేరుతో కబ్జా చేయడానికి కబ్జాదారులు ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆరోపించారు. 'ఇంటి స్థలం కోసం పేదల గోడు' పేరిట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యాన స్థానిక 16వ డివిజన్ ఆవ ప్రాంతం నుంచి సుమారు 4 వేల మందితో ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఎస్‌టీపీ వద్ద మేకల కబేళాను ఆనుకుని ఉన్న 16 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంచాలని భూ పరిరక్షణ పోరాటం నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రజలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల ప్రజలకు 2 సెంట్ల చొప్పున స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం 16 ఎకరాల స్థలంలో ఎర్రజెండా పాతి, కొబ్బరికాయ కొట్టి, దీనిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాల హామీని మంగళగిరి మినహా ఇప్పటి వరకూ ఎక్కడా నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం 8 నెలలుగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం నడిబొడ్డున ఉన్న 28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, పేదల ఇళ్ల స్థలాలుగా పంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ తమ పోరాటం ఆగదని రామకృష్ణ అన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, ఆవకు ఆనుకుని ఉన్న 16 ఎకరాల భూమిలో పేదలకు ఇళ్లు ఇవ్వాలని, సుదూర ప్రాంతాల్లో స్థలాలు ఇస్తే వారు ఇబ్బందులు పడతారని అన్నారు. ఇళ్ల స్థలాలపై తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. తాము రాస్తున్న ప్రతి దరఖాస్తుదారుకు ఇక్కడే ఇంటి స్థలం మంజూరు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేసి త్వరలో ఇక్కడ పాకలు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల సంఘం అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీకి పాముకాటు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన ఉపాధి హామీ పథకం కూలీ జక్కల బేబి పాముకాటుకు గురైంది. గురువారం ఉదయం ముగ్గళ్ళలో పంటకాలువ పూడిక తీత పనులకు 70 మంది కూలీలు పనిలోకి వెళ్లారు. జక్కల బేబి కాలువ పూడిక తీస్తుండగా బురదలో ఉన్న పాము కుడికాలుపై కాటు వేసింది. దాంతో ఒక్కసారిగా కేకలు వేయడంతో కూలీలు బేబికి ఉపశమన చర్యలు చేశారు. సమాచారం అందుకున్న ఏపీవో బీవీ సత్యవతి ఘటనా స్థలానికి చేరుకుని సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందిన అనంతరం మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.

రెండు గంటల్లో బాలిక ఆచూకీ

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన బాలిక అదృశ్యం అయిందని గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో రెండు గంటల్లో ఎస్సై డి.రామ్‌కుమార్ ఆమె ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ముగ్గళ్ళకు చెందిన ఇంటర్మీడియెట్ సెకండియర్ ఫెయిల్ అయిన బాలిక బుధవారం ఉదయం 11.30 గంటలకు తన స్నేహితురాలిని కలవడానికి వెళుతున్నానని చెప్పి రాత్రి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం 11 గంటలకు తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రామచంద్రపురం, వంగలపూడి మధ్యలో ఆమె ఉన్నట్టు ఎస్సై ఫోన్ ట్రాకింగ్‌తో కనుగొన్నారు. హుటాహుటిన తన సిబ్బందితో వెళ్లి ఏటిగట్టు దగ్గరలో పంటపొలాల నుంచి వస్తున్న బాలికను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్(డీఈవోఈజీ.ఓఆర్‌జీ)లో ఉంచారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి సీనియారిటీ జాబితాతో పాటుగా, వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయుల(స్కూల్ అసిస్టెంట్ల) సీనియారిటీ జాబితాలను కూడా ఇందులో పొందుపర్చారు. సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయులు టీఐఎస్‌లో ఇచ్చిన సమాచారం ఆధారంగా, డ్రాయింగ్ అధికారి నిర్ధారించిన ప్రకారం తయారు చేశారు. సబ్జెక్టుల వారీ పదోన్నతులకు ఉపాధ్యాయులకు ఉండాల్సిన విద్యార్హతలకు జీవో నంబరు 67, జీవో నంబరు 15 ప్రాతిపదికన తీసుకోనున్నారు. ఇప్పటికే టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో ఉన్న పొరపాట్లకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అప్‌డేట్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఏదైనా ఉపాధ్యాయుడి టీఐఎస్‌ను సంబంధిత డ్రాయింగ్ అధికారి నిర్ధారించకుంటే డీఈవో కార్యాలయంలో అప్‌డేట్ చేసేందుకు అవకాశముండదు. సీనియారిటీ జాబితాలో జిల్లా పరిషత్తు/మండల పరిషత్తు, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాల్లో చేరిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వారి సర్వీసును ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లెక్కించి సీనియారిటీ జాబితాలో చూపించినట్లుగా అధికారులు చెబుతున్నారు. అంతర జిల్లా బదిలీల్లో వచ్చిన వారికి ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాకు వచ్చిన నాటి నుంచి మాత్రమే సర్వీసును లెక్కిస్తున్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలున్న ఉపాధ్యాయులు ఈ నెల 19వ తేదీ లోగా కాకినాడ డీఈవో కార్యాలయంలో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించే అవకాశం ఉండదు. ఉపాధ్యాయులంతా సీనియారిటీ జాబితాలను సరిచూసుకుని, వాటికి సంబంధించి తేడాలుంటే డీఈవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది.

ఫొటో స్టూడియోలో చోరీ

- రెండు కెమెరాలు, లాప్‌టాప్ దొంగల పాలు
- చోరీ సొత్తు విలువ రూ.1.80 లక్షలు

దేవరపల్లి: స్థానిక ఆర్‌కే డిజిట్ ఫొటో స్టూడియోలో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. గుండుగొలను–కొవ్వూరు రాష్ట్ర ప్రధాన రహదారి(పాత) పక్కన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి సమీపంలో గల డిజిటల్ స్టూడియోలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు కారులో వచ్చి స్టూడియో షట్టర్ తాళం బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించినట్టు సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలో నమోదైంది. స్టూడియో యజమాని కె.రామకృష్ణ కథనం ప్రకారం బుధవారం రాత్రి పెళ్లి ఫొటోలు తీసి 2.30 గంటలకు స్టూడియోకు వచ్చి కెమెరాలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్ స్టూడియోలో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో స్టూడియోకి వచ్చి చూడగా తాళం బద్దలు కొట్టి ఉంది. షట్టర్ తీసి లోపలకు వెళ్లి చూడగా రెండు కెమెరాలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, రెండు హార్డ్ డిస్కులు దొంగిలించుకుపోయినట్టు గుర్తించారు. హార్డ్ డిస్కుల్లో సుమారు 30 పెళ్లిళ్ల ఫొటోలు ఉన్నట్టు ఆయన చెప్పారు. 3 గంటల సమయంలో చోరీ జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై వి.సుబ్రహమణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. కారుకు నంబరు ప్లేట్‌కు స్టిక్కర్ అతికించి దొంగలు జాగ్రత్త పడ్డారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహమణ్యం తెలిపారు. చోరీ జరిగిన వస్తువుల విలువ సుమారు రూ.1.80 లక్షలు ఉంటుందని చెప్పారు. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని మూడు రోడ్ల కూడలి ప్రదేశంలో ఇటు వంటి చోరీలు జరగడం పట్ల వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట: ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ కోర్టు మెజిస్ట్రేట్ షేక్ షరీన్ గురువారం తీర్పు ఇచ్చారని సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. 2022, నవంబర్ 10వ తేదీన పీబీ దేవం రైల్వే గేటు ఎదురుగా ఇద్దరు మహిళలను లారీ ఢీ కొంది. వేట్లపాలెం నుంచి ద్వారపూడి అయ్యప్పస్వామి గుడికి నడిచి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ మహిళలను ఢీ కొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి జిల్లా గుట్టివాడకు చెందిన అద్దం భాస్కరం లారీని నిర్లక్ష్యంగా నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని అప్పటి ఎస్సై టి.సునీత కేసు నమోదు చేశారు. ప్యాసిక్యూషన్ తరఫున పీపీ రఘువీర్ వాదించారు.

అక్రమంగా తరలిస్తున్న 85 గోవుల పట్టివేత



నల్లజర్ల: ఒడిశా రాష్ట్రం నవరంగ్‌పూర్ నుంచి ప్రత్యేక కంటైనర్‌లో హనుమాన్ జంక్షన్‌కు అక్రమంగా తరలిస్తున్న 85 గోవులను నల్లజర్ల శివార్లలో ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ కంటైనర్‌లో బంధించిన 85 గోవులను నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై ఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. వీటన్నింటినీ తూర్పు గోదావరి జిల్లా గోకవరంలోని గోశాలకు అప్పగించనున్నట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో హిందూ ధర్మరక్షణ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గుంటముక్కల రామకృష్ణ, సవలం రామకృష్ణ, మద్దూరి విష్ణుమూర్తి, తాడేపల్లిగూడెం గో సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాన్ స్టాప్ కీబోర్డు ప్లేయర్‌గా

విద్యశ్రీ గిన్నిస్ రికార్డు



గిన్నిస్ రికార్డును అందుకుంటున్న విద్యశ్రీ



గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన విద్యశ్రీ కీబోర్డు ప్లే చేయడంలో గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ విషయాన్ని విద్యశ్రీ తల్లిదండ్రులు సురేష్, సుధారాణి గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం విద్యశ్రీ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కీబోర్డుపై ఉన్న ఆసక్తితో విజయవాడకు చెందిన హల్లెలూయ మ్యూజిక్ స్కూల్‌లో ఆన్‌లైన్ తరగతులకు హాజరై కీబోర్డు ప్లే చేయడంతో పాటు, మెళకువలను నేర్చుకుంది. ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ రికార్డు ప్రతినిధుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు వారు తెలిపారు. గతేడాది డిసెంబరు 1న ఇన్‌స్టాగామ్ వేదికగా ఆన్‌లైన్‌లో గంట పాటు నిర్వహించిన పోటీలో విద్యశ్రీ పాల్గొంది. ఇదే పోటీలో 1,046 మంది ఒకే సమయంలో పాల్గొని గంట పాటు నిర్విరామంగా కీబోర్డు ప్లే చేశారు. గిన్నిస్ రికార్డులో భాగస్వామిగా ఉన్న విద్యశ్రీని గిన్నిస్ రికార్డు ఆఫ్ ఇండియా సంస్థ సర్టిఫికేట్, మెడల్‌ను ప్రదానం చేసింది. ఇంతకుముందు విద్యశ్రీ కీబోర్డు ప్లేయర్‌గా ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇన్‌జనియస్ వరల్డ్ రికార్డును సాధించిందన్నారు. కీబోర్డు ప్లేయర్‌తో పాటుగా, చిత్రలేఖనంలో విద్యశ్రీ రాణిస్తున్నట్లు తెలిపారు.